# ఒక్క దెబ్బకు రెండు పిట్టలు

పరంధామయ్య, పావశాస్త్రి ప్రాణస్నేహితులు. చిన్నప్పుడు ఒకేసారి-చెరో కంచములోతిని ఒకే మంచములో చెరోరోజు చదువుకున్నామన్న సంగతి ఇద్దరూ మరువలేదు.

ఉద్యోగరీత్యా పరంధామయ్య పాలమూరులో పావనశాస్త్రి పాములపర్తిలో వుంటున్నారు గడచిన పాతిక సంవత్సరాల్లో ఓపదిసార్లు కలుసుకునుంటారు. ఉత్తర ప్రత్యుత్తరాల్తో స్నేహ మాధుర్యాన్ని నెమరు వేసుకుంటున్నారు.

ఓసారి స్నేహితుణ్ని చూడాలనే ప్రగాఢ వాంఛ కలిగింది పరంధామయ్యకారోజు. ఈ చిన్న కోర్కెనుగుడా చంపుకుంటే ఇహ జీవితంలో థ్రిల్లు అనేదేముందని వెంటనే ఉత్తరం రాసిపా డేసాడు పావనశాస్త్రికి.

స్నేహితుని ఉత్తరం చూడగానే ఎగిరి గంతేసిన పావన శాస్త్రి వెంటనే జవాబు రాసాడు ఒంటరిగావస్తే చద్మాలాడుతా యని, పిల్లల్తోసహా జంటగా రమ్మని.

* * * * * * *

"నువ్వు అదృష్టవంతుడివిరా! భోంచేసి వచ్చి కుర్చీలో కూర్చుంటూ అన్నాడు పావనశాస్త్రి భోంచేసివచ్చిన పరంధామయ్యతో."

"ఏవిటా అదృష్టం?" నశిగాడు వక్కపొడి నములుతున్న పరంధామయ్య.

"రత్నాల్లాంటి ఇద్దరాడపిల్లలున్నారు నీకు?" అన్నాడు పావనశాస్త్రి తానూ కాస్త వక్కపొడి దట్టిస్తూ.

''అలాగైతే నువ్వే అదృష్టవంతుడివిరా నాకంటే!''

''అదెలాగా?''

''నీకు వజ్రాల్లాంటి కొడుకులున్నారిద్దరు''

'' ఐతే ఏంలాభం? అడనలుసు లేదుగదా '' పెదవులు చప్పరించాడు.

"మరినాకు మగనలుసే లేడుగదా!" నిరాశ వెలిబుచ్చాడు.

నిజమేననుకున్నారిద్దరు బుర్రలు గోక్కుంటూ టేబుల్ మీదున్న వక్కపొడి నందుకుని రెండవరౌండు తగిలించారు భుక్తాయాసంతో.

పావనశాస్త్రి బుర్రలో ఒక్క మెరుపు మెరిసింది.

''ఒరేయ్! పరంధామం?''

''మళ్ళీ ఏం దురదృష్టంరా పావనా?"

''కాదు అదృష్టవశాత్తు ఒక ఐడియా వచ్చిందిరా!''

"అబ్బో! నీ మట్టిబుర్రలో.... ఐడియానా?"

''మాణిక్యాలు దొరికేది మట్టిలోనేకదరా"

"అం సరే.... ఏమిటో చెప్పు!"

"నీ ఇద్దరు కూతుళ్ళలో ఒక కూతుర్ని నాకిచ్చెయ్‌రా. నాకు కూతురులేని లోటుతీరుతుంది'' పరంధామయ్య బుర్రలో ప్రతి మెరుపు మెరిసింది.

"ఐతే...నీఇద్దరి కొడుకుల్లో ఒకణ్ని నాకిచ్చేస్తావా? కొడుకు లేని లోటుతీరుతుంది నాకు!" కనుబొమ్మలు ప్రశ్నార్థకాలైనాయి.

"ఓ! బావుంటుంది. ఉభయతారకం'' అన్నాడు ఎదురుగా వస్తున్నవాళ్ళనుచూస్తూ.

పరంధామయ్య పెద్ద కూతురు చేయి పావనశాస్త్రి పెద్ద కొడుకు చేతిలో చిన్న కూతురు చేయి శాస్త్రి చిన్న కొడుకు చేతిలో.... వచ్చి కూచున్నారు ముసిముసినవ్వుల్తో.

మిత్రరత్నాలు మాట్లడుకున్న మాటల సారాంశాన్ని వారికి చెప్పేసారు ఖుషీగా.

కొడుకులూ, కూతుళ్ళ మొహాలు ఆముదం తాగేసినట్టయిపోయినాయి. నలుగురూ నాలుక్కరుచుకున్నారు పెద్దవాళ్ళ నసహ్యంగాచూస్తూ.

మేమింకా పిల్లలంకాదు నాన్నా! పడుచువాళ్ళమయ్యాం. తమ్ముడు, నేను ఉద్యోగాలు కూడా చేస్తున్నాంగదా!" ధైర్యం చేసి గుర్తుచేసాడు పెద్దకొడుకు.

పడుచువాళ్ళ అభిప్రాయమేమిటో పెద్ద ప్రాణాలకంతుబట్ట లేదు. ఒకరి మొహాలొకరు చూచుకున్నారు వక్కపొడి నమలడమాపి.

పెద్దవాళ్ళ భార్యలిద్దరూవచ్చి కూచున్నారు నవ్వుకుంటూ. నిశ్శబ్దం ఎందుకు రాజ్యమేలుతుందో వారికర్థంకాలేదు.

విషయమేమిటో కనుక్కొని పకపకా నవ్వేశారిద్దరూ.

పావనశాస్త్రి, పరంధామయ్య మొహాలు ఇప్పుడు తాగినాయి అముదం.

"మీ సమస్యను మేము పరిష్కరించగలం" అంది పావన శాస్త్రి భార్య పరంధామయ్య భార్య కళ్ళలోకి చూస్తూ.

"ఎలా పరిష్కరిస్తారు చెల్లాయ్?" ఆశగా చూచాడు పరంధామయ్య రెండుకాళ్ళనూలేపి కుర్చీలో ముడుచుకుంటూ.

"ఏమీలేదన్నయ్యా! మా ఇద్దరు కొడుకులకు మీ ఇద్దరి కూతుళ్ళనిచ్చి పెళ్ళిచేద్దాం?"

"ఆ తర్వాత!"

"మా పెద్దకొడుకూ కోడల్ని మావద్ద ఉంచుకుంటాం, చిన్నకొడుకూ కోడల్ని మీ వద్దనే ఉంచేస్తాం" అంది.

గుండెలనిండా ఊపిరి పీల్చుకున్నారందరూ.

'ఔనా?! మీకు కొడుకులేనిలోటు, మాకు కూతురు లేనిలోటు ఒకేసారి తీరిపోతాయి" అన్నాడు పావనశాస్త్రి మూడోరౌండు వక్కపొడి పనిబడుతూ.

'ఒక్క దెబ్బకు రెండు పిట్టలన్న' మాట!
సంతోషంతో అరిచినంత పంజేసాడు పరంధామయ్య.

అందరి మొహాల్లో కొత్త వెలుగులు కొట్టొచ్చినట్టు కనబడ్డాయి.

కొత్త జంటలు సిగ్గుల మొగ్గలు పరుస్తూ తుర్రుమన్నాయి.

( జాగృతి 10-10-1988 )